

నామినేషన్ కౌంటర్ (4వ రోజు)

ఎంపీ/ఎమ్మెల్యే నియోజకర్గాలు	నాలుగో రోజు నామినేషన్లు	మొత్తం
నరసాపురం ఎంపీ	01	07
1.ఆచంట	01	05
2.పాలకొల్లు	01	06
3.నరసాపురం	03	05
4.భీమవరం	02	03
5.ఉండి	03	07
6.తణుకు	02	08
7.తాడేపల్లిగూడెం	00	03
మొత్తం	12	37
ఏలూరు ఎంపీ	05	08
1.ఉంగుటూరు	02	04
2.దెందులూరు	03	05
3.ఏలూరు	01	03
4.పోలవరం	02	05
5.చింతలపూడి	03	06
6.నూజివీడు	02	07
7.కైకలూరు	05	09
మొత్తం	18	39

అమ్మాయిలదే హవా

జిల్లా ఉత్తీర్ణత శాతం 81.82

- 23 స్థానంతో వెనుకబడ్డ పశ్చిమ
- మొత్తం విద్యార్థులు.. 20,785
- 17,007 మంది ఉత్తీర్ణత
- బాలురు 8,262.. బాలికలు 8,745
- గతంకంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 : పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో బాలికలు హవా సాగించారు. బాలురు 78.90 శాతం, బాలికలు 84.80 శాతం ఉత్తీర్ణతతో నిలిచారు. జిల్లా ఉత్తీర్ణత 81.82 శాతంగా నమోదైంది. ఈ ఏడాది మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 20,785 మంది విద్యార్థులు హాజరు కాగా 17,007 మంది పాసయ్యారు. వీరిలో బాలికలు 10,313 మందికి 8,745 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 10,472 మందికి 8,262 మంది పాసయ్యారు. జడ్పీ హైస్కూల్స్‌లో 9,851 మంది పరీక్షలు రాయగా, 7,149 మంది ఉత్తీర్ణత సాధించారు. సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 288 మందికి 272 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 7,872 మందికి 7,611 మున్సిపల్ స్కూళ్లల్లో 1,805 మందికి 1,266 మంది ప్రభుత్వ పాఠశాలల్లో 435 మందికి 328 మంది, బీసీ వెల్ఫేర్ స్కూల్స్‌లో 201 మందికి 194 మంది, ఎయిడెడ్ పాఠశాలల్లో 333 మంది విద్యార్థులకు 187 మంది ఉత్తీర్ణులయ్యారు.

పెరిగిన ఉత్తీర్ణత

2022-23 విద్యా సంవత్సరం టెన్త్ పరీక్ష ఫలితాలలో జిల్లా 64 శాతం ఉత్తీర్ణత సాధిస్తే.. ఈ ఏడాది 2023-24 ఉత్తీర్ణత 81.82 శాతంగా నిలిచింది. అంటే గత ఏడాదికంటే ఈ ఏడాది 17 శాతం పెరిగింది. రాష్ట్రంలో జిల్లా ఉత్తీర్ణతలో 23 స్థానంలో నిలిచి వెనుకబడింది. విద్యార్థులు రీ-కౌంటింగ్ మరియు రీ-వెరిఫికేషన్ కోసం ఏప్రిల్ 23 నుంచి 30వ తేదీ వరకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫీజును చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రీ కౌంటింగ్ ఒక సబ్జెక్ట్‌కు రూ.500, రీ-వెరిఫికేషన్ ఒక సబ్జెక్ట్‌కు రూ.1000 చెల్లించాలి.

'పది' చరిత్రలో ఆల్ టైం హై రికార్డు మనస్విదే !


తల్లిదండ్రులతో మనస్వి

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షల్లో ఏకంగా 599 మార్కులను సాధించి తెలుగు రాష్ట్రాల్లో, ఎస్ఎస్‌సీ పరీక్షల చరిత్రలో ఆల్ టైం హై రికార్డును సొంతం చేసుకున్న ఆకుల వెంకటసాయి మనస్వి సరికొత్త అధ్యాయాన్ని సృష్టించింది. ఒక్క హిందీ సబ్జెక్టులో వందకు 99 మార్కులు రాగా, మిగతా అన్ని సబ్జెక్టుల్లో వందకు వంద మార్కులతో స్టేట్ నెంబర్ వన్ టాపర్‌గా రికార్డులను తిరగరాసింది. మనస్వి సాధించిన రికార్డు సోమవారం తెలుగు రాష్ట్రాల్లో మారుమోగిపోయింది. ఈమెకు వచ్చిన మార్కులు ప్రతీ ఒక్కరినీ షాక్‌కు గురిచేసాయి. మనస్వి తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. తండ్రి ఏ.ఎన్.వి.ప్రసాద్ నూజివీడు మండలం అన్నవరం మండల పరిషత్ పాఠశాలలో ఎస్జీటీగా గతేడాది నుంచి ఎంటీఎస్ విధానంలో పనిచేస్తుండగా, తల్లి శైలజ చాట్రాయి మండలం సోమవరం మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఈ దంపతుల ఏకైక కుమార్తె మనస్వి.

టెక్ట్స్ బుక్ పఠనంతోనే ఈ విజయం

మనస్వి నూజివీడు నారాయణ టెక్నో స్కూలులో ఎల్‌కేజీ నుంచి చదువుతోంది. ఈమె పదో తరగతిలోకి ప్రవేశించిన నాటి నుంచి చదువుకు ఆటంకం కాకూడదన్న ఆలోచనతో తల్లిదండ్రులిద్దరూ తమ స్వగ్రామం నుంచి నూజి వీడుకు నివాసాన్ని మార్చుకున్నారు. తండ్రి నిత్యం తమ కుమార్తెను స్కూలు వద్ద మోటారు బైక్‌పై దించిన అనంతరం తన స్కూలు విధులకు వెళ్ళి, తిరిగి వచ్చేటపుడు ఇంటికి తీసు కువచ్చేవారు. తమ కుమార్తె ఘన విజయంపై తల్లిదండ్రులు పంచుకుంటూ 'మా అమ్మాయి కేవలం టెక్ట్స్ బుక్స్‌తోనే ప్రిపేర్ అయింది. ప్రతీ పాఠ్యాంశంపైనా ఏకాగ్రత పెంచుకుని సొంతంగా ప్రశ్నలు, బిట్స్ తయారు చేసుకోవడం, ముఖ్యమైన ప్రశ్నలు, వాటికి సంబంధించి పాఠ్య పుస్తకంలో లైన్లను రాసుకునేది. అలాగే ప్రశ్నల సరళిని ఎప్పటికప్పుడు గమనిస్తుండేది. చదువుపై మేం ఏనాడూ ఒత్తిడి పెట్టలేదు. స్కూల్‌లో ఫస్ట్ రావాలని మాత్రం ప్రోత్సహించేవాళ్లం. టెన్త్ పరీక్షలు ఏ రోజుకారోజు ముగిసిన వెంటనే ఆ పరీక్షలో వందకు వంద మార్కులు వస్తాయని ఎంతో ధీమాగా చెప్పేది. మేమైతే 585-590 మార్కులు వస్తాయని ఊహించాం. ఇంటర్‌లో ఎంపీసీ లేదా ట్రిపుల్ ఐటీలో చేర్పాలనుకుంటున్నాం' అని వివరించారు.



ఐఏఎస్ సాధిస్తా

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదో తరగతిలో 581 మార్కులు సాధించా. భవిష్యత్‌లో సివిల్ సర్వీస్ పరీక్ష రాసి ఐఏఎస్ సాధించాలన్నది నా లక్ష్యం. అమ్మ, నాన్నల సహకారం మరువలేనిది. చదువులో మెరుగైన ఫలితాలు సాధిస్తా.

ఆడారి నవ్యశ్రీ, పీఎస్ఎం పాఠశాల, భీమవరం

ఐఐటీలో సీటు సాధిస్తా



ఐఐటీలో సీటు సాధించి కంప్యూటర్ ఇంజనీర్ కావాలన్నదే నా లక్ష్యం. టెన్త్‌లో 581 మార్కులు సాధించాను. మొదటి నుంచి చదువుకుంటూ వచ్చా. చదువు విషయంలో ఉపాధ్యాయుల మేలు మరువలేనిది. అమ్మా నాన్నల ప్రోత్సాహం వల్లే ఇన్ని మార్కులు సాధించా.

- బి.దివ్యశ్రీలక్ష్మీ, పీఎస్ఎం పాఠశాల, భీమవరం



చదువులోనే ఎక్కువ సమయం

ఉన్నత చదువులలో ఇంకా బాగా రాణించాలన్నదే నా లక్ష్యం. అమ్మా, నాన్న, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో 582/600 మార్కులు సాధించా. మొదటి నుంచి చదువుకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నా.

-బి.శారదాదేవి, జేఎల్‌బీ మున్సిపల్ పాఠశాల, భీమవరం

పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష ఏర్పాట్లపై సమీక్ష

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 : జిల్లాలో ఈ నెల 27న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని డీఆర్వో జె.ఉదయభాస్కరరావు తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష 2024పై వివిధ శాఖల అధికారులతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ 'జిల్లాలో 22 పరీక్ష కేంద్రాలలో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు 7,329 మంది హాజరు కానున్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది. విద్యార్థులు పరీక్షకు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఇప్పటికే హాల్ టికెట్స్ పంపించాం' అని తెలిపారు. పరీక్షల నిర్వహణలో పోలీసు, మునిసిపాలిటీ, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్షించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకు ఆదేశాలు ఇచ్చారు.

పార్లమెంట్‌కు 1 అసెంబ్లీకి 12

జిల్లాలో నాలుగో రోజు నామినేషన్లు


ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే మంతెన, బీజేపీ ఎంపీ అభ్యర్థి వర్మతో కలిసి నామినేషన్ పత్రాలను ఆర్వో ప్రవీణ్‌కు అందజేశారు

భీమవరం టౌన్/తణుకు/నరసాపురం టౌన్/భీమవరం అర్బన్/ఆచంట/ఉండి, ఏప్రిల్ 22 : నామినేషన్ల ప్రక్రియలో భాగంగా సోమవారం నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున మన్నే లీలారామ్‌నరేంద్ర ఒక సెట్ నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందజేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 12 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉండి టీడీపీ అభ్యర్థిగా కనుమూరు రఘురామకృష్ణ రాజు, కనుమూరు భరత్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియన్ అభ్యర్థిగా అల్లూరి సతీష్ చంద్రకుమార్ ఆర్వో, జేసీ ప్రవీణ్ ఆదిత్యకు అందించారు. తణుకు కాంగ్రెసు అభ్యర్థిగా కడలి రామారావు, బీఎస్పీ అభ్యర్థిగా ఆకుమర్తి ధనుంజయ్, ఆచంట బీఎస్పీ అభ్యర్థిగా ఆలూరి చిన్నారావు, పాలకొల్లు జై భారత్ నేషనల్ పార్టీ తరపున బెజవాడ తులసీరావు, నరసాపురం జనసేన అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్, ఆయన సోదరుడు బొమ్మిడి సునీల్ నాయకర్, పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా బుర్రా రామకృష్ణ, భీమవరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అంకె సీతారామ్, స్వతంత్ర అభ్యర్థిగా గుగ్గిలపు రామకృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నరసాపురం కూటమి తరపున బీజేపీ ఎంపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ నామినేషన్ దాఖలు చేయనున్నారు.


ఏలూరు ఎంపీ అభ్యర్థిగా ఆర్వో, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పుట్టా మహేశ్, చిత్రంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

ఏలూరు ఎంపీ అభ్యర్థిగా కూటమి నుంచి టీడీపీ తరపున పుట్టా మహేశ్‌యాదవ్ కలెక్టరేట్‌లో ఆర్వో, జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. అంతకుముందు భారీ ర్యాలీగా తరలివచ్చారు. అలాగే దెందులూరు, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గాలకు కూటమి తరపున టీడీపీ అభ్యర్థులు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు.


నరసాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నాయకర్, చిత్రంలో షరీఫ్, మాధవనాయుడు, కొత్తపల్లి, రామరాజు

పవన్ కల్యాణ్ పర్యటన వాయిదా

భీమవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటన వాయిదా పడింది. రెండు రోజులపాటు జిల్లాలో పవన్ కల్యాణ్ పర్యటన నిర్వహించాల్సి ఉంది. తొలిరోజు ఆదివారం నర్సాపురం, భీమవరం సభల్లో పాల్గొన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం, గణపవరం పర్యటన ఖరారైంది. అయితే పవన్ పయనించే హెలిక్యాప్టర్ మరమ్మతులకు గురికావడంతో సోమవారం పర్యటనను వాయిదా వేసుకున్నారు. పిఠాపురంలో మంగళవారం జనసేనాని నామినేషన్ దాఖలు చేయనుండటంతో ఈ రోజు మొత్తం బిజీగా ఉంటారు. మళ్లీ ఎప్పుడు వచ్చేది ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానుంది.

ఉండిలో గెలిచేది నేనే

- ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజు

ఉండి, ఏప్రిల్ 22 : అసెంబ్లీ ఎన్నికల్లో ఉండి ఎమ్మె ల్యేగా 50 వేల మెజారిటీతో గెలిచి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇవ్వనున్నట్టు టీడీపీ అభ్యర్థి కనుమూరు రఘురామ కృష్ణరాజు ధీమా వ్యక్తం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు, ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జనసేన్ ఇన్‌చార్జ్ జుత్తుగ నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు, జనసేన నేత వేగేశ్న కనకరాజుసూరి తదితరులతో భారీ ర్యాలీగా ఉండి ఆర్వో కార్యాలయానికి వచ్చి నామినేషన్ పత్రాలు దాఖలుచేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లా డారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులను తాను మరువలేనని తెలిపారు. తాను నామినేషన్ వేయడానికి వస్తున్నానని తెలిసి భీమవరం, పెదఅమిరం, చినఅమి రం రహదారులు ఉండి రహదారులు అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిండిపోయిందన్నారు. మండుటెండలో తనకు కోసం వచ్చిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఉండి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సుడిగాలి పర్యటన చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే మంతెన రామరాజు మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు చెప్పిందే వేదమన్నారు. రఘురామ విజయం కోసం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.


రఘు..రామరాజులకు భారీ గజమాల

నేతలకు సోకు.. జనాలకు షాక్

నామినేట్ పదవులతో కలిగిన మేలేంటి ?

- జిల్లాకు అదనంగా వచ్చిపడిందేంటి..?
- సామాజికవర్గాల పేరిట జగన్ మాయలు
- ఎన్నికల పండుగ వేళ మళ్లీ ఇదే తాయిలాలు
- ఐదేళ్ల పాలనలో మిగిలిందంతా జీరోనే

అంతన్నారు.. ఇంతన్నారు. తాము తప్ప మరే రాజకీయ పార్టీ సేవ చేయలేదన్నారు. కులాల సంక్షేమం అంటే తమకు ఎంతో ఇష్టమన్నారు. అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే వైసీపీ ప్రభుత్వం తమ నేతలందరికీ పదవులు పందేరం చేసింది. అధికార దర్పం ప్రదర్శించేలా అన్ని హంగులు కల్పించింది. నెలవారీ గౌరవ వేతనాలు ఇచ్చి సగం సదుపాయాలు కల్పించి ఇదిగో మీ సామాజిక వర్గానికి ఒక కార్పొరేషన్.. కొద్ది నెలల్లోనే మీ సామాజిక వర్గంలో వెలుగులు నింపుతామంటూ గొప్పాలు పలికింది. కాని చెప్పింది ఒకటి చేసింది ఇంకోటి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆయా సామాజిక వర్గాల కార్పొరేషన్‌లకు రాష్ట్రస్థాయి చైర్మన్‌లను నియమించింది. మరికొందరిని జిల్లా స్థాయిలో నామినేట్ చేసింది. తమ జెండా మోస్తూ వారి రుణం తీర్చుకునేందుకు నామినేట్ పదవులు ఇచ్చింది. కాని ఐదేళ్లుగా ఒక్కటంటే ఒక్క పనిగాని, తమకంటూ వ్యక్తిగత ముద్ర గాని కార్పొరేషన్‌పరంగా ఒక గుర్తింపు గాని తేలేకపోయారు. కొల్లేరు పరిధిలోనే వేలాది మందికి చెందిన ఓ సామాజిక వర్గం వారే ఉన్నారు. వీరి కోసం ప్రత్యేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదు. ఈ సామాజిక వర్గానికి అదనంగా పట్టెడన్నం, చేతి నిండా పని కల్పించడానికి ఒక్క ప్రయత్నమూ లేదు. మరేం చేశారంటే ఆ సామాజికవర్గ అభివృద్ధి కోసమంటూ ఒక కార్పొరేషన్ పెట్టి సొంత పార్టీకి చెందిన వ్యక్తిని నియమించి ఇంకేముంది సంక్షేమం మీ వైపే అంటూ ఊదరగొట్టారు. ప్రత్యేకంగా ఐదేళ్లల్లో చేసిదేమీ లేదు. సూర్యబలిజ, అతిరస, వడ్డీలు సామాజిక వర్గానికి చెందిన ఒక్కరిని పైకి తేలేకపోయారు. కేవలం పార్టీ పరంగానే నేతలకు మాత్రం సోకు ఇచ్చి ఏమి చేయలేక జనానికి షాక్ ఇచ్చారు. ఏలూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ కింద నానా హంగామా చేశారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఈ ఐదేళ్లలో ముగ్గురిని చైర్మన్‌గా నామినేట్ చేశారు. ఈ అథారిటీ పరిధిలో ఏం చేశారని చూస్తే ఫ్లయ్ ఓవర్‌లు మీద అక్కడక్కడ చిన్న చిన్న మొక్కలు నాటడం, సిమెంటు కుండీలు తప్ప మరేది సాధ్యం కాలేదు. ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ ఇచ్చి సరిపెట్టారు.

ఎన్నికల లబ్ధి కోసం కార్పొరేషన్ల ఏర్పాట్లు, చైర్మన్‌లు, డైరెక్టర్‌లు నియామకమే తప్ప వెనక్కి తిరిగి చూస్తే ఆయా సామాజిక వర్గాల్లో ఏ మాత్రం వెలుగులు నింపలేదు. ఇప్పుడు వారిలో చైతన్యం వచ్చి చెప్పేది ఒకటి.. చేసేది ఒకటా అంటూ అసంతృప్తితో ఉన్నారు. రుణ సదుపాయం, ఉపాధి కల్పన, మరికొంత వ్యాపారం, చేతినిండా పనికల్పించలేని కార్పొరేషన్లు కేవలం నేతల కోసమేనా.. మరి దిగువనున్న జనం కోసం ఏం చేశారనే ప్రశ్నలు తాజాగా సంధిస్తున్నారు. సమాధానం చెప్పేందుకు ఏ ఒక్కరూ సిద్ధంగా లేనేలేరు. మళ్ళీ ఎన్నికలు రావడంతో పాత పాట అందుకుంటున్నారు. స్థానిక నేతలు ఈసారి అధికారంలోకి వస్తే ఫలానా కార్పొరేషన్‌లో మీకే పదవులు అంటూ తాయిలాలు విసురుగుతున్నారు. చైర్మన్ పదవి లాక్కుంటే డైరెక్టర్ అయినా అయ్యేలా చూస్తామంటూ హామీ ఇస్తున్నారు. కాని ఆయా సామాజిక వర్గాల్లో రగులుతున్న అసంతృప్తి మండుటెండలకు మించే ఉంది. సమయం కోసం, మార్పు కోసం ఎదురు చూసే దిశగా అడుగులు వేస్తున్నట్టు ఆయా సామాజిక వర్గాల్లో ప్రజలు విశ్లేషిస్తున్నారు.

హామీలివ్వలేని అభ్యర్థులు

స్థానిక సమస్యలు, అభివృద్ధిపై వైసీపీలో వింత పరిస్థితులు

ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పరిష్కారం కాలేదు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అభ్యర్థులు అగ్ని పరీక్షను ఎదుర్కొంటున్నారు. స్థానిక సమస్యలను ప్రస్తావించలేక, కొత్త హామీలను ఇవ్వలేక సతమతం అవుతున్నారు. ప్రభుత్వ పథకాలే తమను గట్టెక్కిస్తాయని చంకలు గుద్దుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో మాత్రం నియోజకవర్గాల్లో లెక్కకు మిక్కిలి సమస్యలు ఉన్నాయంటూ ఏకరవు పెట్టారు. అధికారంలోకి వస్తే వాటిని నెరవేరుస్తామంటూ హామీలు ఇస్తూ వచ్చారు. తీరా పదవులు చేపట్టాక వాటిని అటకెక్కించేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి మరోవైపు కూటమి అభ్యర్థులు తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలతోపాటు, నియోజకవర్గాల్లో చేయబోయే అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.

- భీమవరంలో డంపింగ్ యార్డు, ట్రాఫిక్, మంచినీటి సమస్యలు వెంటాడుతున్నాయి. గత ఎన్నికల ముందు గ్రంధి శ్రీనివాస్ వీటిపై హామీ ఇచ్చారు. అవి ఇప్పటికీ తీరలేదు. యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్ రోడ్లులు నిర్మిస్తామని చేసిన ప్రకటనలు గాలికొదిలేశారు. టీడీపీ హయాంలో అమృత్ పథకంలో వాటర్‌హెడ్ ట్యాంక్‌లు, కొత్త పైప్‌లైన్‌లు వేశారు. వైసీపీ హయాంలో అమృత్ 2.0లో కేంద్రం మంజూరైన నిధులకు వైసీపీ ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇవ్వలేదు. ఇదే ఇప్పుడు ఈ నియోజకవర్గంలో అధికార పార్టీని వెంటాడుతున్నాయి.
- తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టు సత్యనారాయణ హామీలకు అంతూ పొంతూ లేకుండాపోయింది. విమానాశ్రయ భూముల్లో నివాసితులకు పట్టాలు ఇస్తామన్నారు. రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామంటూ హామీలు గుప్పించారు. అవేమీ నెరవేరలేదు. ఇప్పుడు అవే సమస్యలు వెంటాడుతున్నాయి.
- తణుకులో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఇస్తామంటూ కారుమూరి నాగేశ్వరరావు 2019లో హామీ ఇచ్చారు. స్టేడియం ఏర్పాటు, అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం పూర్తి చేస్తామంటూ భరోసా ఇచ్చారు. గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తణుకులో ఇంటింటికి నీటిని సరఫరా చేస్తామంటూ గొప్పలు చెప్పారు. వాస్తవానికి తెలుగుదేశం హయాంలోనే పైప్‌లైన్ ప్రాజెక్ట్‌కు టెండర్‌లు ఖరారయ్యాయి. అప్పట్లో ఇచ్చిన హామీలు ఏవీ నెరవేరలేదు. ఇప్పుడు తణుకు నియోజకవర్గానికి ఇది చేస్తామంటూ చెప్పుకోలేకపోతున్నారు. కొత్త హామీలు ఇవ్వలేకపోతున్నారు.
- పాలకొల్లులోనూ అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో ఎటువంటి హామీలు ఇవ్వలేకపోతోంది. పాదయాత్రలో భాగంగా 2019లో జగన్ పాలకొల్లు పట్టణానికి డంపింగ్ యార్డు నిర్మాణం, ఉచితంగా టిడ్కో ఇళ్లు, గోదావరి నుంచి మంచి నీటి సరఫరా వంటి ప్రధాన హామీలిచ్చారు. కనీసం వాటి అమలుకు గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం చర్యలు తీసుకోలేకపోయింది. అక్కడ ప్రతిపక్ష కూటమికి ఇవే ప్రచార అస్త్రాలయ్యాయి.
- నర్సాపురంలోనూ గత ఎన్నికల్లో వైసీపీ ఇచ్చిన హామీలకు కొదువలేదు. నల్లీ క్రీక్ ప్రక్షాళన చేసేస్తాం. హార్బర్‌ను నిర్మిస్తాం. పట్టణానికి డంపింగ్ యార్డును పూర్తి చేస్తాం. కాలువల ఆధునీకీకరణ చేపడతాం. నియోజకవర్గ ముఖ్య రహదారుల అభివృద్ధిపై ఎన్నికల ముందు జగన్‌తోపాటు, ముదునూరి ప్రసాదరాజు ఎన్నో హామీలు గుప్పించారు. అవేమీ నెరవేరలేదు. పైగా ముఖ్యమంత్రి వశిష్ట వారిధికి హామీ ఇచ్చారు. హార్బర్‌కు శంకుస్థాపన చేశారు. ఇవేమీ అమలుకు నోచుకోలేదు. అభివృద్ధి విషయమై ముదునూరి ప్రసాద్‌రాజు ఒక్కమాట చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారు.



- ఉండి నియోజకవర్గంలో జగన్ పాదయాత్రలో ఆక్వా రంగానికి అనేక హామీలు ఇచ్చేశారు. యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కు ఇస్తామన్నారు. నాన్‌జోన్ పేరుతో యూనిట్ విద్యుత్ ధర రూ.4.50లకు పెంచేశారు. మరోవైపు మండల గ్రామాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఏర్పాటు చేసి వాటర్ ప్లాంట్‌లను నిర్మిస్తామంటూ ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అవేమీ అమలు కాలేదు. రహదారులను అభివృద్ధి చేయలేకపోయారు. మళ్లీ ఎటువంటి హామీలు ఇవ్వాలో తెలియక అక్కడ అధికార పార్టీ అభ్యర్థి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.
- ఆచంటలో ప్రతిచోట కమ్యూనిటీ హాళ్లను నిర్మించేస్తాం. కల్యాణ మండపాలు నిర్మిస్తాం. ఆచంటలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణమంటూ గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే రంగనాథరాజు ఎన్నో హామీలు ఇచ్చారు. ప్రభుత్వం అవేమీ నెరవేర్చలేదు. తాజాగా హామీలిస్తున్నా ప్రజల్లో నమ్మకం ఉండడం లేదంటూ కేడర్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. కొత్త హామీలు ఇవ్వలేని పరిస్థితి ఆచంటలోనూ నెలకొంది. అన్ని నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ అభ్యర్థులు సంకట స్థితిలో ఉన్నారు.

పిలిచి మరీ చంపేశాడు

- కుటుంబ కలహాలతో వ్యక్తి దారుణ హత్య
- భోగాపురంలో ఘటన.. నిందితుడు పరార్

పెదవేగి, ఏప్రిల్ 22 : కుటుంబ కలహాలు వ్యక్తి హత్యకు దారితీశాయి. రహదారిపై వెళ్తున్న వ్యక్తిని పిలిచి మరీ హత్య చేశాడు. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, స్థానికులు తెలిపిన వివరాలివి. పెదవేగి మండలం భోగాపురానికి చెందిన పామర్తి రంగారావు(44), మండపాక వరప్రసాద్ మేనత్త, మేనమామ కుమారులు. కొంత కాలంగా ఆ రెండు కుటుంబాల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. సోమవారం ఉదయం పదిన్నర సమయంలో రహదారిపై వెళ్తున్న రంగారావును కూల్ డ్రింక్ షాపులో ఉన్న వరప్రసాద్ పిలిచి, ఏంటీ దుర్భాషలాడుతున్నావంటూ ప్రశ్నిస్తూ, ఒక్కసారిగా జేబులో నుంచి చాకు తీసి నాలుగైదు పోట్లు పొడిచాడు. దీంతో కుప్ప కూలిన రంగారావు తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వరప్రసాద్ ద్విచక్ర వాహనంపై అక్కడ నుంచి పారిపోయాడు. సమీపంలో ఉన్న వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. శవ పంచనామా నిర్వహించి, శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



పూడిపోయిన గోస్తనీ నది

జగన్మాయ

హామీలే..

అమలు చేస్తామా.. ఏంటి..!?

హామీ ఇచ్చేస్తే పోలా.. అమలు చేస్తామా.. ఏంటి..!? అధికార పార్టీ నేతల తీరు అచ్చంగా ఇలాగే ఉంది. అధికారం కోసం నోటికొచ్చిన హామీ ఇచ్చేశారు.. ఐదేళ్లలో వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. గోదావరిపై అయోధ్యలంక, పుచ్చల్లంక మధ్య హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక బ్రిడ్జి హామీ గోదాట్లో పడేశారు. నియోజకవర్గ ప్రజలకు పైపులైన్ల ద్వారా గోదావరి జలాలను తాగునీరుగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ గోదాట్లో కలిపేశారు. ఆచంటలో 100 పడకల ఆస్పత్రి హామీకి సుస్తీ చేసింది. పెనుగొండ మండలం సిద్ధాంతంలో రూ. 5 కోట్లతో శ్మశానం అభివృద్ధి హామీని సమాధి చేశారు. పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లిందరపర్రులో రూ. 8.12 కోట్ల లాకుల అభివృద్ధి హామీ కాల్వలో కొట్టుకుపోయింది..

- ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ

ఆచంట నియోజకవర్గం అభివృద్ధికి దూరం

తాగునీటికి గోదావరి జలాలు ఇవ్వలేదు.. గోదాట్లో హైలెవెల్ బ్రిడ్జి



నిలిచిపోయిన లాకుల అభివృద్ధి పనులు

నెరవేరని సీఎం హామీ



ఎన్నికల ప్రచారంలో భాగంగా జగన్ పెనుగొండలోజరిగిన సభలో అయోధ్యలంక, పుచ్చల్లంక బ్రిడ్జిని అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్మిస్తామని చెప్పారు. ప్రస్తుతం దాని ప్రస్తావనే లేదు.

గత ఎన్నికల్లో చెరుకువాడ రంగనాథరాజు అనేక హామీలు గుప్పించారు.

- అధికారంలోకివస్తే గోదావరి జలాలను అక్కడే శుద్ధిచేసి పైపులైన్ ద్వారా గ్రామాలకు అందించడం వైసీపీ లక్ష్యం అంటూ ప్రచారం చేశారు. ఐదేళ్లుగా గ్రామాలకు గోదావరి జలాల జాడలేదు.
- బ్రిటిష్ కాలంలో గోస్తనీ నదిపై నిర్మించిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మిస్తానన్నారు. కొత్త వంతెన నిర్మాణం లేదు సరికదా శిథిలావస్థలో ఉన్న వంతెనకు కనీసం మరమ్మతులు లేవు.
- పెనుమంట్ర మండలంలో ప్రధాన మురుగు కాల్వ గోస్తనీ నది తూడుతో పూడికపోవటంతో 6వేల ఎకరాల పంట ఏటా వర్షాలకు నీట మునుగుతోంది. పట్టించుకున్న దాఖలాలు లేవు.
- ఆచంటలో 30 పడకల ఆసుపత్రిని వంద పడకలుగా అభివృద్ధి చేస్తామన్న హామీ మరిచిపోయారు.
- ఆచంటలో దశాబ్దాల తరబడి ఎన్నికల హామీగానే మిగిలిన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల స్థలం సేకరించి పంచాయతీ తీర్మానం చేసినా నిర్మాణం చేపట్టలేదు.
- ఆచంటకు ప్రధాన సమస్య మురుగు డ్రెయిన్ లేకుండా చేస్తానని హామీ ఇచ్చినప్పటికీ ఐదేళ్లూ విస్మరించారు.
- పెనుగొండ మండలం సిద్ధాంతం శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.5 కోట్లుతో పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కనీసం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు.
- పెనుగొండ సంత మార్కెట్ అభివృద్ధి, పెనుగొండ ట్రంకుపెట్టెల పరిశ్రమకు గుర్తింపు తెస్తానన్న హామీలు గుర్తున్నాయో లేదో..?

ఆచంట మండలంలో పలు అభివృద్ధి పనులకు చెరుకువాడ శ్రీరంగనాథరాజు హామీలు ఇచ్చారు. ఐదేళ్లుగా వాటిని పట్టించుకోలేదు. గోదావరి నదిపై హైలెవల్ బ్రిడ్జి, వంద పడకల ఆస్పత్రి, అగ్నిమాపక కేంద్రం, డ్రెయినేజీ, కాపు, బీసీ ఎస్సీ కమ్యూనిటీ భవనాలు, ఆచంటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామన్న హామీలు అమలుకు నోచుకోలేదు. సిద్ధాంతం ఇసుక బంటా కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారు. పెనుగొండ సంత మార్కెట్ అభివృద్ధి, ట్రంకుపెట్టెల పరిశ్రమకు గుర్తింపు హామీలు పట్టించుకున్న దాఖలాలు లేవు. పెనుమంట్ర మండలంలో నాలుగు గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందించేలా బ్రిటిష్ హయంలో ఏర్పాటు చేసిన ఎస్ ఇల్లింద్రపర్రు లాకులు పునర్నిర్మాణంపై హామీలతో రైతులను నమ్మించి ఐదేళ్లుగా ఐదు పైసలు ఖర్చు చేయలేదు. 2018లో లాకుల అభివృద్ధికి రూ. 8.12 కోట్లతో పనులు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పనులు కొంత వరకు జరిగినప్పటికీ ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. శ్రీరంగనాథరాజు ఎమ్మెల్యేగా లాకు అభివృద్ధి పనులు పూర్తిచేస్తానని హామి ఇచ్చినా అది హామిగానే మిగిలిపోయింది. దీంతో రైతులు నిరాశకు గురి అవుతున్నారు.

నత్తారామేశ్వరం- వేల్పూరు రహదారి, మార్టేరు - వనంపల్లి రహదారి పట్టించుకోలేదు. ఇరగవరం-అత్తిలి రోడ్డు అభివృద్ధి ఆగిపోయింది. పెనుమంట్ర మండలంలో ప్రధాన మురుగు కాల్వ గోస్తనీ నది పూడికపోవటంతో 6వేల ఎకరాల రైతులకు ఏటా నష్టం తప్పడం లేదు. పూడిక తీత, గట్టు అభివృద్ధి హామీలు తూతూమంత్రంగా చేపట్టారు. తూడు తొలగింపు పనులు అధికార పార్టీ నేతలు సబ్ లీజుకు తీసుకుని పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోగా జేబులు నింపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పెనుమంట్ర మండలంలో గత తెలుగుదేశంహయంలో చేపట్టిన అభివృద్దిపనులను నేటి పాలకులు పట్టించుకోకపోవడంతో దాదాపు రూ.20 కోట్ల అభివృద్ధి పనులు నిలచిపోయాయి. రూ.90 లక్షలతో నిర్మాణం చేపట్టిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం పిల్లర్ దశలోనే ఆగిపోయింది. అదే ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు కూడా నిలిచిపోయాయి.



నియోజకవర్గ కేంద్రం ఆచంటలో ప్రధాన సమస్య మురుగు



శిథిలావస్థలో పెనుమంట్ర మండలం మాముదూరు వంతెన



టీడీపీ ప్రభుత్వ హయాంలో అయోధ్యలంక బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకం

మూడు వేల ఆయకట్టుకు ముంపు ముప్పు



ఎస్.ఇల్లింద్రపర్రు లాకు ఎగువన ఉన్న నాలుగు గ్రామాలకు 3వేల ఆయకట్టుకు సాగునీరు, తాగునీరు అందిస్తుంది. లాకు శిథిలావస్థకు చేరడంతో పంటలకు ముంపు ముప్పు తప్పడం లేదు. కొత్త లాకుల నిర్మాణం జరుగుతుంది కదా ఎటువంటి ఇబ్బందులు ఉండవని భావించాం. కానీ ప్రస్తుత పాలకులు హామీ ఇచ్చారే తప్ప నిర్మాణం చేయలేకపోయారు. ఎప్పుడు ఉపద్రవం వస్తోందనని భయపడుతున్నాం.

- వనం శ్రీను, రైతు, ఎస్ ఇల్లింద్రపర్రు

నేటి పాలకులు వదిలేశారు



తెలుగుదేశం పాలనలో కొత్త లాకుల నిర్మాణ పనులు ప్రారంభించారు. 2019 ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం లాకుల నిర్మాణం వైపు కన్నెత్తి చూడకపోవటంతో శిథిలావస్థకు చేరిన లాకులతో పాటు ప్రారంభించిన పనులు సైతం శిథిలావస్థకు చేరే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోవడం లేదు. రైతులను నట్టేట ముంచేవిధంగా పాలన ఉంటే ఎలా?

పాలా దానయ్య, రైతు, ఎస్.ఇల్లింద్రపర్రు

హై..హై నాయకా..

అధికార పార్టీ హడావుడి

తాడేపల్లిగూడెం పట్టణంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఒకరు వైసీపీలో చేరారు. తెలుగుదేశం కూటమికి పెద్ద దెబ్బ అంటూ అధికార పార్టీ హడావుడి అంతా ఇంతా కాదు. వాస్తవానికి వైసీపీలో చేరిన నాయకుడు 2014లో అదే పార్టీలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థికి అప్పట్లో ప్రచారం చేశారు. ఆ ఎన్ని కల్లో వైసీపీ ఓటమి పాలైంది. తెలుగుదేశం కూటమి అభ్యర్థిగా బీజేపీ తరపున పైడికొండల మాణిక్యాలరావు గెలుపొందారు. మంత్రి అయ్యారు. దాంతో సదరు వైస్ చైర్మన్ బీజేపీలో చేరారు. ఐదేళ్లపాటు పైడికొండల మాణిక్యాల రావుతో నడిచారు. 2019 ఎన్నికల ముందు మాణిక్యాలరావును వదిలి తెలుగుదేశంలో చేరారు. గడచిన ఎన్నికల్లో తెలుగుదేశం ఓటమి చవిచూడడంతో అప్పటినుంచి పార్టీకి దూరంగా ఉన్నారు. ఏ రోజూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన లేదు. రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తాజాగా వైసీపీలో చేరడంతో అధికార పార్టీ నాయకులు సంబర పడిపోతున్నారు. కూటమికి పెద్ద దెబ్బేనని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు.

- తాడేపల్లిగూడెం అర్బన్

ప్రముఖ నేతల చింతలపూడి టూర్



ముఖ్యమంత్రిగా చింతలపూడి పర్యటనలో ఎన్‌టీ రామారావు

చింతలపూడి నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి నియోజకవర్గంలో ఎందరో ముఖ్యమంత్రులు, ప్రముఖులు అధికార హోదా, ప్రతిపక్ష హోదాలో పర్యటించారు. కానీ గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్ ఒక్కసారి కూడా నియోజకవర్గంలో పర్యటించలేదు.

- 1967లో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించారు.
- 1976లో సీఎం జలగం వెంగళరావు తమ్మిలేరు రిజర్వాయర్ నిర్మాణ పనులు పర్యవేక్షణకు, 84లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో మరోసారి పర్యటించారు.
- 1979లో ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, చింతలపూడి ఉన్నత పాఠశాల, హాస్టల్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన నిమిత్తం ముఖ్యమంత్రి హోదాలో వచ్చారు.
- 1982లో ఏఐసీసీ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ రాష్ట్ర పర్యటనలో భాగంగా చింతలపూడి సుప్రియన్‌పేటలో పర్యటించి బహిరంగ సభలో మాట్లాడారు.
- 1983లో ఎన్టీఆర్ ప్రచార యాత్రకు వచ్చారు. ఆయనను చూడడానికి ప్రజలు పలు గ్రామాల నుంచి వచ్చి మూడు రోజులు రోడ్లపైనే వంటలు చేసుకుని వండుకుని నిద్రించి ఎన్‌టీఆర్‌ని చూసి తరించారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత 1987 సెప్టెంబర్‌లో చింతలపూడి దుర్భిక్ష ప్రాంతంలో పర్యటించి ఒకరోజు రాత్రి ఇక్కడే ఉన్నారు. మరోసారి వివేకానందుని గెటప్‌లో నియోజకవర్గంలోని కామవరపుకోట బహిరంగ సభలో మాట్లాడారు.
- టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సీఎం హోదాలో మూడుసార్లు, ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఐదుసార్లు నియోజకవర్గంలో పర్యటించారు. 1992లో నామవరంలో ఉమ్మడి అటవీ యాజమాన్య పథకాన్ని ప్రారంభించారు. 2003లో తూర్పు యడవల్లి రామాలయం సందర్శించారు. 2006లో తమ్మిలేరు వరదకు శివపురం నీటమునిగింది. బాధితులను, గ్రామస్థులను పరామర్శించారు. 2008లో మీకోసం వస్తున్న పాదయాత్రలో చింతలపూడి రోడ్‌షోలో పాల్గొని ఇక్కడి నుంచి తెలంగాణ సరిహద్దులోకి వెళ్లారు. 2018లో ముఖ్యమంత్రి హోదాలో చింతలపూడి బోయగూడెం సభలో మాట్లాడారు. 2022లో ప్రతిపక్ష నాయకుడి హోదాలో జంగారెడ్డిగూడెంలో సారా మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. 2023లో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని మొదటి బహిరంగ సభ ఇక్కడి నుంచే ప్రారంభించారు. 2024లో రా కదిలిరా బహిరంగ సభలో కూడా పాల్గొన్నారు.
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నియోజకవర్గంలో నాలుగు సార్లు పర్యటించారు. ఒకటి రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు, రెండోసారి పీసీసీ అధ్యక్షుని హోదాలోనూ, మూడోసారి 2003లో ప్రజాప్రస్థానం పాదయాత్రలో జిల్లాలో పర్యటనలో భాగంగా చింతలపూడి నియోజకవర్గంలోని మూడురోజులు పాదయాత్ర జరిపారు. ముఖ్యమంత్రి హోదాలో ఒకసారి వైఎస్ పర్యటించారు.
- 2012లో నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో రచ్చబండ కార్యక్రమాన్ని చింతలపూడి నుంచే ప్రారంభించారు.
- వైఎస్ జగన్ ప్రతిపక్ష హోదాలో 2018లో పాదయాత్ర చేశారు. తరువాత ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా పర్యటించలేదు.

- చింతలపూడి

బీ కేర్ ఫుల్



కాకి లెక్కలు

విజయంపై అభ్యర్థి ధీమా

• వారించిన అధినేత • కష్టపడాలని దిశానిర్దేశం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. అధికార పార్టీ నాయకులపై అవినీతి మచ్చ ఉంది. ఇంకేముంది తమ గెలుపు నల్లేరు నడకే అని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు భావిస్తున్నారా..? ఆ ధీమా ఉంటే ఎన్నికల్లో బోల్తా పడతామని కూటమి శ్రేణులు చర్చించుకుంటున్నాయి. తీర ప్రాంతంలో ఒక నియోజకవర్గ అభ్యర్థి అక్కడ నెలకొన్న సామాజిక సమీకరణలు బేరీజు వేసుకుంటున్నారు. గెలిచేస్తామని విశ్వాసంతో ఉన్నారు. గడచిన ఎన్నికల్లో తక్కువ ఓట్ల తేడాతో పరాజయం పొందామని, ఇప్పుడు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమితో విజయం సాధిస్తామని నమ్మకంగా ఉన్నారు. అన్ని పార్టీలు ఓట్ల గణాంకాలను బేరీజు వేసుకుంటే గెలుపు సునాయాసమేనని భావిస్తున్నారు. కానీ ఎన్నికల్లో నాయకులందరినీ కలుపుకొని వెళ్లాలి. ఇదే విషయాన్ని పాలకొల్లులో నిర్వహించిన కూటమి అభ్యర్థుల సమీక్షలో ప్రత్యేకంగా చంద్రబాబు నొక్కి చెప్పారు. గెలుపు ధీమా వద్దంటూ కర్తవ్య బోధ చేశారు. సదరు నియోజకవర్గ ముఖ్య నాయకులను ఎన్నికలకు సమాయత్తం చేయడంలో చంద్రబాబు చొరవ చూపారు. ఇప్పుడు నాయకులంతా ప్రచారంలో దూకారు. నాయకులతోపాటు, కేడర్‌ను కూడా కలుపుకొని వెళుతున్నారు. వ్యయప్రయాసలకోర్చి ముందుకు సాగాలి. అధికార పార్టీ డబ్బుతోనే ఎన్నికలను నిర్వహించేద్దామన్న ప్రణాళికలు రచిస్తోంది. కూటమి అభ్యర్థికి అండగా ఉన్న రెండు బలమైన సామాజిక వర్గాల ఓటర్లను డబ్బుతో తమవైపు తిప్పుకోవాలని లెక్కలు వేసుకుంటున్నారు. కులాల చిచ్చు పెడుతున్నారు. వీటన్నింటినీ అంచనా వేసుకుని కూటమి ఓటు బ్యాంకును కాపాడుకోవాలి. ఆ దిశగా నాయకులను, కార్యకర్తలను సంసిద్ధం చేయాలి. అప్పుడే విజయం సాధ్యమని కూటమి శ్రేణుల్లో చర్చ సాగుతోంది.

అధికారం ఆమెదే

జిల్లా నుంచి ఎమ్మెల్యే, ఎంపీలైన మహిళలు



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో మహిళల ఓట్లు, పదవులు కూడా పెరుగుతూ వచ్చాయి. 1955లో తొలిసారి ఆత్తిలి నుంచి అమ్మన్న రాజా గెలుపొందారు. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించిన తర్వాత మహిళల ప్రాతినిధ్యం మరింత పెరిగింది.

- 1970 ఉప ఎన్నికల్లో ఉండి అసెంబ్లీ స్థానంలో స్వతంత్ర అభ్యర్థిగా కె. ఆండాలమ్మ ఎమ్మెల్యేగా గెలిచారు.
- 1978లో గోపాలపురం అసెంబ్లీ నుంచి తొలిసారిగా దాసరి సరోజినీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇక్కడి నుంచి రెండోసారి మహిళ మద్దాల సునీత 2004లో ఎన్నికయ్యారు. 2009లో ఇదే స్థానంలో తానేటి వనిత టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
- 1981లో నరసాపురం అసెంబ్లీలో తొలిసారి పరకాల కాళికాంబ కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు.
- 1983, 1987 ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నుంచి ఈలి వరలక్ష్మి గెలిచారు.
- పెనుగొండ అసెంబ్లీ నుంచి1983, 1985లలో వరుసగా ప్రత్తి మణెమ్మ ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి అయ్యారు.
- 1995లో దెందులూరు అసెంబ్లీ స్థానంలో మాగంటి వరలక్ష్మి కాంగ్రెస్ నుంచి గెలుపొంది మంత్రి పదవి దక్కించుకున్నారు.
- 1999లో ఆచంట నుంచి టీడీపీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసిన గెలుపొందిన తొలి మహిళ మోచర్ల జోహార్వతి.
- 2004లో ఆచంట నుంచే పీతల సుజాత టీడీపీ తరఫున గెలుపొందిన రెండో మహిళ.
- 2009లో పాలకొల్లు నుంచి బంగారు ఉషారాణి కాంగ్రెస్ తరఫున గెలుపొందారు.
- 2014లో చింతలపూడి స్థానంలో పీతల సుజాత టీడీపీ తరఫున గెలిచిన తొలి మహిళా ఎమ్మెల్యే.
- 2019లో కొవ్వూరు అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ తరఫున గెలిచిన తానేటి వనిత గెలుపొంది మంత్రి అయ్యారు.

పార్లమెంట్ స్థానంలో..

జిల్లా నుంచి పార్లమెంట్ స్థానంలో మహిళలు ఎన్నికయ్యారు. 1952 లో సీపీఐ నుంచి అమన్నరాజా పోటీపడ్డారు. 1957లో సీపీఐ అభ్యర్థి విమలాదేవిపై కాంగ్రెస్ అభ్యర్థి వేదకుమారి విజయం సాధించారు. 1962లో మరోసారి వారిద్దరూ పోటీపడగా విమలాదేవి గెలుపొందారు. 2009లో నరసాపురం పార్లమెంట్ నుంచి టీడీపీ తరఫున తోట సీతారామలక్ష్మి పోటీ చేసి ఓటమి చెందారు. తరువాత రాజ్యసభకు వెళ్లారు.

స్థానిక సంస్థల్లో..

స్థానిక సంస్థల్లో కూడా మహిళలకు రిజర్వేషన్ అమలు కావడంతో టీడీపీ హయాంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా తొలిసారి ఇమ్మణ్ణి రాజేశ్వరి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఘంటా పద్మశ్రీ జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. శాసన మండలి సభ్యురాలిగా గంగాభవాని ఈ జిల్లా నుంచి అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. జడ్పీటీసీ, మండల పరిషత్ అధ్యక్షులు, సర్పంచ్‌లుగా పలువురు మహిళలు పాలనలో సత్తా చాటుతున్నారు.

- భీమవరం టౌన్

పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఇలా..



సాధారణ ఎన్నికల విధుల్లో నియమితులైన అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా పార్లమెంట్, అసెంబ్లీ ఓటు వేస్తారు. వారు ఫారం-12 వినియోగించుకునేందుకు పాటించాల్సిన విధివిధానాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్ తెలిపారు. సంబంధిత రిటర్నింగ్ అధికారికి కాపీ ఆఫ్ ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్, ఎన్నికల ఐడీ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలను జతచేసి ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారి జారీచేసే రెండు పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకుని మే 8లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారి ఏర్పాటు చేయించిన డబ్బాలో వాటిని వేయాలి. బాధ్యతగల పౌరులుగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు.

- ఏలూరు అర్బన్

రూ.2.75 లక్షలతో ఎమ్మెల్యేనయ్యా

కొండ్రెడ్డి విశ్వనాథం
మాజీ ఎమ్మెల్యే



ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థుల ఖర్చు తడిసిమోపెడవుతోంది. 1994 ఎన్నికల్లో తాను రూ. 2.75 లక్షల ఖర్చుతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని మాజీ ఎమ్మెల్యే కొండ్రెడ్డి విశ్వనాథం చెప్పారు. అప్పట్లో టీఎన్.శేషన్ ఎన్నికల ప్రధానాధికారి. నిబంధనల అమలులో ఆయన కఠినంగా వ్యవహరించారు. రాజకీయ పార్టీలు బెంబెలెత్తి పోయాయి. నిబంధనల అమలులో కచ్చితంగా వ్యవహరించడమే కాకుండా మద్య నిషేధం, నగదు పంపిణీపై ఉక్కుపాదం మోపారు. ఇదే అంశం పలువురు అభ్యర్థులకు కలిసి వచ్చింది. కొందరు అభ్యర్థులు నానా తంటాలు పడ్డారు. దీంతో ఎన్నికల ప్రచారం చప్పగా సాగింది. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి తాను కేవలం రూ.2.75 లక్షలతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని గుర్తు చేసుకున్నారు. ఉంగుటూరు, కైకరం గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేయాలని ప్రయత్నించినా ఆలయ ప్రాంగణాలలో ఎన్నికల ప్రచారం చేయడానికి వీలు లేకుండా పోయిందన్నారు. రిక్షాలు, ఆటోలతోనే ఎన్నికల ప్రచారం చేయవలసి రావడం, వాల్‌పోస్టర్లకు కూడా అనుమతి తీసుకోవలసి ఉండడంతో నానా అవస్థలు పడ్డామన్నారు. ఎన్నికల నిబంధనల పుణ్యమా అని సాధారణ వ్యక్తినైన తాను ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం విశేషమని విశ్వనాథం గుర్తు చేసుకున్నారు.

- ఉంగుటూరు

జడ్పీటీసీ ఓటమి.. మంత్రి పదవికి ఎసరు



మంత్రి ఇలాకాలో మండల జడ్పీటీసీ సభ్యుడి ఉప ఎన్నికలో అధికార పార్టీ ఓటమి మంత్రిగారి పదవికి ఎసరు పెట్టింది. మంత్రిగా ఉన్న నియోజకవర్గంలో జడ్పీటీసీని గెలిపించుకోలేకపోవడంతో సీఎం వ్యాఖ్యలతో ఆ మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మాగంటి వెంకటేశ్వరరావు (బాబు)ను రెండేళ్ల తర్వాత చిన్న నీటి పారుదల శాఖ మంత్రి పదవి వరించింది. ఏడాది తరువాత దెందులూరు మండల జడ్పీటీసీ పదవికి ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓటమి పాలవడంతో మంత్రి మాగంటి బాబు తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2009లో మాగంటి బాబు టీడీపీ తరఫున ఎంపీగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2014లో టీడీపీ నుంచి ఎంపీగా గెలిచారు. 2019లో ఎంపీగా ఓటమి చెందారు.

- పెదవేగి

పవన్ కల్యాణ్ సభలో బ్లేడు కలకలం

భీమవరం క్రైం, ఏప్రిల్ 22 : భీమవరం ప్రకాశం చౌక్‌లో ఈనెల 21వ తేదీన జరిగిన పవన్ కల్యాణ్ బహిరంగ సభలో ఇద్దరు యువకులు బ్లేడులతో సభలోకి వచ్చారని సమాచారం రావడంతో పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చెయ్యగా ఎటువంటి బ్లేడులు, ఆయుధాలు లేవని తెలియడంతో పోలీసులు వారిని విడిచిపెట్టారు. అయితే పట్టుబడినవారు వైసీపీ సానుభూతిపరులని తెలుస్తున్నది. దీనిపై వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీనును వివరణ కోరగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద బ్లేడులు, ఆయుధాలు లేవని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్

ఎన్నికల ఖర్చుపై నిఘా పెట్టాలి

భీమవరం టౌన్, ఏప్రిల్ 22 : ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల ఖర్చులపై నిరంతర నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకురాలు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్ ఆయా నోడల్ ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. నామినేషన్లు ప్రారంభమైన దృష్ట్యా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. స్వేచ్ఛగా నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునేలా ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఖర్చులను అభ్యర్థుల ఖాతాలకి చూపడంలో ఎన్నికల సిబ్బంది నిష్పక్ష పాతంగా వ్యవహరించాలన్నారు. ప్రచార ఖర్చులు, బహుమతుల పంపిణీ, ఇతర ఖర్చులపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వ్యయ పర్యవేక్షణ బృందాల పనితీరు గురించి వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, జిల్లా ఎన్నికల నియంత్రణ కేంద్రం (కంట్రోల్ రూమ్), రాజకీయ ప్రచారానికి సంబంధించిన అనుమతుల గురించి వివ రించారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల భద్రతా ఏర్పాట్లను వివరించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఎంసీఎంసీ సెంటర్‌ను నీనా నిగమ్ జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కె.సంగీత్ మాదూర్, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.



ఎస్ఈబీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్ఈబీ కమిషనర్ ఎం.రవిప్రకాష్

సరిహద్దుల్లో పటిష్ట నిఘా

ఏలూరు క్రైం, ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, జిల్లాలో గంజాయి, మద్యం, అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని ఎస్ఈబీ జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు తెలిపారు.స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాష్ట్ర కమిషనర్ ఎం.రవిప్రకాష్ జిల్లా ఎస్ఈబీ అధికారులతో సోమవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకూ తనిఖీల్లో సీజ్ చేయబడిన, నగదు మద్యం వివరాలను వెల్లడించారు. విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణ, ఎస్ఈబీ అధికారులు పాల్గొన్నారు.



టీడీపీ కంచుకోట



8 ఎన్నికలలో ఏడుసార్లు టీడీపీదే విజయం..ఒకే ఒక్కసారి కాంగ్రెస్

డెల్టా, తీర ప్రాంతాల మేలు కలయికగా ఉన్న ఉండి నియోజకవర్గం చారితక్ర ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచంలో అతిపెద్ద మంచినీటి సరస్సులో ఒకటిగా ఉన్న కొల్లేరు సరస్సు ఒక వైపు, మరోవైపు ఉప్పుటేరు, ప్రధాన మేజర్ కాలువల ద్వారా జలసిరులతో బంగారు పంటలు పండుతుండటంతో పాటుగా, ఆక్వా పరిశ్రమ వృద్ధి చెందుతోంది. ఈ నియోజక వర్గంలో ఉద్దండులైన నేతలెందరినో చట్టసభలకు పంపిన చరిత్ర ఉంది. తెలుగుదేశం ఆవిర్భావం తరువాత జరిగిన 8 ఎన్నికలలో ఏడుసార్లు టీడీపీ విజయం సాధించి రాష్ట్రంలో రెండవ కుప్పంగా పేరొందింది. 2009 వరకూ ఉండి నియోజకవర్గంలో కాళ్ళ, ఉండి, ఆకివీడు మండలాలు మాత్రమే ఉండేవి. 2009లో పునర్విభజన జరగడంతో పాలకోడేరు మండలం చేరింది.

\- ఆకివీడు

ఉండి నియోజకవర్గం పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వస్తుంది. నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో ఉంది. 2024 ఓటర్ల జాబితా ప్రకారం ఉండి నియోజక వర్గంలో 2,22,999 ఓటర్లు ఉండగా పురుషులు 1,09,414, మహిళలు 1,13,583 మంది ఉండగా ఇతరులు ఇద్దరు ఉన్నారు. మొత్తంమీద ఈ నియోజకవర్గంలో మహిళలదే పైచేయిగా ఉంది.



ఉండిఅసెంబ్లీ నియోజకవర్గంలోని ఉండి, ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు మండ లాలలో ఉన్న 70 గ్రామాలలోని 238 పోలింగ్ కేంద్రాలలో 2,22,999 మంది ఓటర్లు ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం అయిన తరువాత 1983 నుంచి 2004 వరకు వరుసగా ఐదు పర్యాయాలు మాజీ మంత్రి కలిదిండి రామచంద్రరాజు (అబ్బాయి రాజు) టీడీపీ తరుపున గెలిచారు. 2004 లో కాంగ్రెస్ అభ్యర్థి పాతపాటి సర్రాజు గెలిచారు. 2009, 2014లో వరుసగా రెండుసార్లు వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) టీడీపీ తరుపున గెలుపొందారు. 2019లో అనూహ్యంగా శివరామ రాజు నర్సాపురం ఎంపీ టీడీపీ అభ్యర్థిగా వెళ్ళడంతో మంతెన రామరాజు ఉండిలో పోటీ చేసి గెలుపొందారు.

నియోజకవర్గంలో వెనుకబడిన తరగతులు వారు అత్యధికంగా ఉన్నారు. తరువాత కాపు సామాజికవర్గం, క్షత్రియులు ఉండగా, ఎస్సీ, మైనార్టీలు, ఎస్టీలు తదుపరి స్థానాల్లో ఉన్నారు. తెలుగుదేశానికి కంచుకోటగా ఉన్న ఉండి నియోజకవర్గంలో ఈసారి పాగా వేయడానికి వైసీపీ గట్టి ప్రయత్నాలు చేస్తున్నది.



టీడీపీ ఆవిర్భావం నుంచి ఉండి నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా ఉంది. 1983లో టీడీపీ ఆవిర్భవించిన తొలిసారే కలిదిండి రామచంద్రరాజు 33,431 ఓట్లు ఆధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థి జి.రామచంద్రరాజుపై ఘన విజయం సాధించారు. ఆ తరువాత రెండేళ్లకే జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి డివి బాలసుబ్రహ్మణ్యం పై 29,133 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. 1983 నుంచి ఈ నియోజకవర్గంలో ఒకసారి మినహా 2019 వరకూ టీడీపీయే అధికారం చేపట్టింది. అయితే 2004లో కాంగ్రెస్ గెలిచింది. 1983 నుంచి 1999 వరకూ టీడీపీ నుంచి ఐదుసార్లు కె.రామచంద్రరాజు, 2004 కాంగ్రెస్ నుంచి పాతపాటి సర్రాజు, 2009, 2014లో టీడీపీ నుంచి వేటుకూరి వెంకట శివరామరాజు, 2019లో టీడీపీ నుంచి మంతెన రామ రాజు గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి దండుబోయిన పేరయ్యపై 5283 ఓట్లు, 1994లో కాంగ్రెస్-ఐ అభ్యర్థి కఠారి ప్రభాకరరావుపై 9208 ఓట్లు తేడాతో టీడీపీ అభ్యర్థి కె.రామచంద్రరాజు (అబ్బాయిరాజు) గెలుపొందారు.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ
1983	కలిదిండి రామచంద్రరాజు	టీడీపీ	జి.రామచంద్రరాజు	కాంగ్రెస్	33,431
1985	కలిదిండి రామచంద్రరాజు	టీడీపీ	డివి బాలసుబ్రహ్మణ్యం	కాంగ్రెస్	29,133
1989	కలిదిండి రామచంద్రరాజు	టీడీపీ	దండుబోయినపేరయ్య	కాంగ్రెస్	5,283
1994	కలిదిండి రామచంద్రరాజు	టీడీపీ	కె.ప్రభాకరరావు	కాంగ్రెస్	9,208
1999	కలిదిండి రామచంద్రరాజు	టీడీపీ	గోకరాజు రామరాజు	కాంగ్రెస్	14,614
2004	పాతపాటి సర్రాజు	కాంగ్రెస్	కె.రామచంద్రరాజు	టీడీపీ	19,488
2009	వేటుకూరి వి.శివరామరాజు	టీడీపీ	పాతపాటి సర్రాజు	కాంగ్రెస్	15,748
2014	వేటుకూరి వి.శివరామరాజు	టీడీపీ	పాతపాటి సర్రాజు	వైసీపీ	36,231
2019	మంతెన రామరాజు	టీడీపీ	పీవీఎల్ నర్సింహరాజు	వైసీపీ	10,949

ఫ్లాష్ బ్యాక్

రెండుసార్లు మంత్రి పదవులు

ఉండి నియోజకవర్గానికి రెండుసార్లు మంత్రి పదవి వచ్చింది. ఎన్టీఆర్ హయాంలోని 1985లో చిన్నతరహా పరిశ్రమలు, నారా చంద్రబాబునాయుడు సమయంలో విద్యుత్ శాఖ మంత్రిగా కలిదిండి రామచంద్రరాజు (అబ్బాయిరాజు) పని చేశారు. అ తరువాత చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో టీటీడీ ఛైర్మన్‌గా అబ్బాయిరాజును నియమించారు.

వేద పండితులకు నిలయం

పూర్వం ఆకివీడు ఆధ్యాత్మకతకు నిలయంగా ఉండేది. ఆకివీడు రాణా వీధిలో వేద పండితులు 100 కుటుంబాలు ఉండేవారు. వేద అధ్యయనం, వేదపఠనం జరిగేది. వచ్చిన వారికి లేదనకుండా బ్రాహ్మణ భోజనం (స్వహస్త పాకం) చేసి అరిటాకులో వడ్డించేవారు. యజ్ఞాలు, యాగాలు చేసేవారు. శ్రావణమాసంలో వేద సభ నిర్వహించేశారు.

రైస్ మిల్లులకు ప్రసిద్ధి

పూర్వం ఆకివీడులో సుమారు 35 రైస్ మిల్లులు ఉండేవి. రాను రాను ఆక్వా పరిశ్రమ, రియల్ ఎస్టేట్ రావడంతో రైస్ మిల్లులు తగ్గిపోయాయి. ప్రస్తుతానికి సుమారు 18 రైస్ మిల్లులున్నాయి. వీటి పరిస్థితి కూడా అంతంత మాత్రమే. ఆకివీడులోని హోల్‌సేల్ చేపల మార్కెట్‌లో గతంలో ఏ సమయంలోనైనా ఎటువంటి చేపలు కావాలన్నా దొరికేవి. ఇక్కడ నుంచి ఇతర దేశాలకు చేపలు అధికంగా ఎగుమతులు జరిగేవి. కరోనా తర్వాత నుంచి హోల్‌సేల్ వ్యాపారం కొంతమేర తగ్గింది..



రాజీనామాకు..నో

వైసీపీ నాయకుల ఒత్తిడికి తలొగ్గని వలంటీర్లు

టీడీపీ ప్రకటనతో ఆలోచనలో..

బెడిసికొట్టిన వైసీపీ వ్యూహం



ఏలూరు రూరల్, ఏప్రిల్ 22: ఇంతకాలం ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలుగా చెప్పుకొస్తున్న వలంటీర్లను రాజీనామా చేసి ప్రత్యక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొనాలన్న వైసీపీ నేతల వ్యూహం బెడిసికొడుతోంది. ఇంతకాలం తమ సేవలు వినియోగించుకుని ఇప్పుడు కాదంటారా అంటూ వలంటీర్లు వైసీపీ నేతలపై మండిపడుతున్నారు. తమసేవల వల్లే అటు ప్రభుత్వానికి ఇటు పార్టీకి మంచి పేరు వచ్చిందని ప్రచారం చేసుకుని గొప్పలు చెప్పుకున్న వైసీపీ నాయకులు ఇప్పుడు అవసరం తీరాక బోడిమల్లన్న అంటారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కమిషన్ జోక్యంతో వారంతా ఎన్నికల విధుల్లోనే కాదు.. పింఛన్ల పంపిణీకి దూరంగా ఉన్నారు. అలాగే ప్రచారంలో పాల్గొనకుండా అడ్డుకట్ట పడటంతో వైసీపీ నాయకులు వలంటీర్ల సేవలను వినియోగించుకోవడానికి శతవిధాలా ప్రయత్నించారు. చివరకు వలంటీర్ల రాజీనామా అస్త్రాలను తెరపైకి తెచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే కొంతమంది రాజీనామాలు చేసి ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ఇంతలో టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్లకు వరాలు ప్రకటించారు. అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. గౌరవవేతనం రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. దీంతో వలంటీర్లలో ఉత్సాహం, ఉద్యోగ భద్రత ఏర్పడింది. వైసీపీ నాయకులు వలంటీర్లపై కొద్దిరోజులుగా ఒత్తిడి మొదలు పెట్టారు. వీరిమాటలు హామీలు, లెక్కచేయని వలంటీర్లు టీడీపీ అధికారంలోకి వస్తే మాకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెగేసి చెబుతున్నారు. రాజీనామా చేసి తమకు ప్రచారం చేయాలని కొందరు బెదిరిస్తున్నా వారు బెదరడం లేదు. ఎన్నికల విధులు, ప్రచారంలో పాల్గొనలేమని తెగేసి చెప్పడంతో వైసీపీ నాయకుల వ్యూహం బెడిసికొట్టినట్లు అయింది.



22-04-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	268	227	246.29
జంగారెడ్డిగూడెం-1	272	235	254.30
జంగారెడ్డిగూడెం-2	272	236	258.69
కొయ్యలగూడెం	271	235	255.82
గోపాలపురం	271	235	255.19

నామినేషన్ల సంబరం



నరసాపురంలో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న నాయకర్.. మద్దతుగా కొత్తపల్లి సుబ్బారాయుడు, బందారు మాధవనాయుడు, పొత్తూరి, షరీఫ్ తదితరులు



కార్యకర్తలు, అభిమానుల ర్యాలీ మధ్య చింతమనేని ప్రభాకర్

అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా భారీ ర్యాలీలు, వివిధ వేషధారణలు, ప్రదర్శనలతో కోలాహలం నెలకొంది. ఉండిలో రఘురామ కృష్ణరాజు, నరసాపురంలో నాయకర్, దెందులూరులో చింతమనేని ప్రభాకర్, ఏలూరులో ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌లు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థికి మద్దతుగా పార్టీ కార్యకర్తలు, నాయకులు ర్యాలీగా తరలి వచ్చారు. ఏలూరులో విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు, భారీ ర్యాలీ మధ్య మహేష్ యాదవ్ నామినేషన్ వేసేందుకు విచ్చేశారు.



రఘురామకు మద్దతుగా గొల్లలకోడేరు నుంచి ర్యాలీగా బయలుదేరిన శ్రేణులు



ఏలూరులో మహేష్ యాదవ్ నామినేషన్ సందర్భంగా ర్యాలీలో ఆకట్టుకున్న వివిధ ప్రదర్శనలు

అభ్యర్థుల ఆస్తులు-అప్పులు

నరసాపురం : బొమ్మిడి నాయకర్ (ఉమ్మడి అభ్యర్థి)



వయసు : 50
విద్యార్హత : డిగ్రీ
చరాస్తులు : 4,52,799
బ్యాంకు డిపాటిట్ : 32,68.515
బంగారం : 2.4 లక్షలు
స్థిరాస్తులు : 17.95 లక్షలు
బ్యాంకు రుణాలు: 1,46,52,087

భార్య సునీత

చరాస్తులు : 1,48,500, డిపాజిట్లు : 21 వేలు
బంగారం : 9.18 లక్షలు
స్థిరాస్తులు : 12.80 లక్షలు, ఇల్లు రూ.6 లక్షలు
రుణాలు : 25.99 లక్షలు

ఏలూరు : ఆళ్ళ నాని (వైసీపీ అభ్యర్థి)



విద్యార్హత : ఇంటర్, బీకాం మధ్యలో నిలుపుదల
చరాస్తులు : రూ.1,39,96,885,
భార్య పేరిట రూ.72,69,897
స్థిరాస్థి : రూ.55,60,650,
సతీమణి పేరిట రూ.5,92,29,200,
సొంతింటి విలువ రూ.2,00,22,000,
భార్య పేరున రూ.6,20,54,000,
బంగారం : రూ.4,55,000,
భార్య పేరున రూ.47,25,000,
అప్పులు : రూ.27,51,846,
భార్య పేరున : రూ.9,45,100,
వాహనాలు : టయోటా (రూ.32,31,000)
వాల్వోకారు (రూ.83,80,000)
భార్యకు మహేంద్రా స్కార్పియో (రూ.16,31,301)
ఇసూజు టీమ్యాక్స్ ట్రూ (రూ.8,71,047)



స్వాధీనం చేసుకున్న నాటు సారా , సామగ్రి

60 లీటర్ల సారా స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 22 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు జిల్లాలోని ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. కొయ్యలగూడెం మండలం కామయ్యకుంట పంచాయతీ లంకపల్లి అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్న కేంద్రాన్ని గుర్తించి సోమవారం ఎస్ఈబీ ఇన్ స్పెక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్ళు వెంకట్, రాంబాబు, సాయిలు దాడి చేశారు. 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 2500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలవరం ఎస్ఈబీ అధికారులకు అప్పగించి తదుపరి చర్యలు చర్యలు నిమిత్తం ఆదేశాలు జారీ చేశారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం/ కామవరపుకోట, ఏప్రిల్ 22 :రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లజాము వరకూ జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలోని అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు.

రూ.1.59 లక్షలు నగదు స్వాధీనం

కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్టులో ఎటువంటి పత్రాలు లేకుండా ఆటోలో తీసుకు వెళ తున్న వ్యక్తి నుంచి లక్షా 59 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్టు ఎన్నికల అధికారి ఎండి మొహిద్దీన్ తెలిపారు. మొవ్వ మండలం కూచిపూడి గ్రామానికి చెందిన వ్యక్తి సోమవారం ఆటోలో నగదు తీసుకు వెళుతుండగా నగదుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ట్రెజరీలో జమచేసే ఏర్పాటు చేశామన్నారు. రామకృష్ణ, సూర్యనాయక్, సుధీర్, నాగార్జున ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాలకు మేలు


పెనుమదంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల

పోడూరు, ఏప్రిల్ 22: వచ్చే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తామని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పెనుమదంలోని ఆయా శివారు ప్రాంతాల్లో ఆయన సోమవారం కూటమి శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు వైసీపీ నాయకులు చెప్పే మాయమాటలు విని రాజీనామాలు చేయొద్దని వచ్చే మా కూటమి ప్రభుత్వంలో వలంటీర్లకు జీతాలు పెంచి మంచి భవిష్యత్తును ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగురైతు కమిటీ కార్యదర్శి రాచకొండ విశ్వనాధం, బీజేపీ పరిశీలకుడు అడబాల సత్యనారాయణ, యర్రంశెట్టి పద్మారావు, కడలి అంజనేయులు, బోసుపాముల పెద్దిరాజు, దేవరపు దొరబాబు, తంగెళ్ల సత్యనారాయణ, పితాని వెంకట్ పాల్గొన్నారు.

17వ వార్డులో సూర్యకుమారి ప్రచారం



పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 22: పాలకొల్లు లో ఎమ్మెల్యే రామానాయుడును గెలిపిస్తే పేదలు, మహిళలకు టిడ్కోగృహాలు ఉచితంగా పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. సోమవారం పాలకొల్లు 17వ వార్డులో ఆమె ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఉన్నమట్ల కబర్ధి, కకొండ కుమార్, కొండేటి వీరకుమార్, పంజా దుర్గ, అంబళ్ల లక్ష్మీజ్యోతి, పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

పితానికి శెట్టిబలిజ యూత్ మద్దతు


పితానికి శెట్టిబలి యూత్ సభ్యుల మద్దతు

పెనుమంట్ర, ఏప్రిల్ 22: ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి పితాని సత్యనారాయణకు తమ మద్దతు ప్రకటిస్తున్నామని పెనుమంట్ర మండలం మల్లిపూడికి చెందిన తూర్పురామాలయం శెట్టిబలిజ యూత్, పడమటి రామాలయం శెట్టిబలిజ యూత్ సభ్యులు 150 మంది జుత్తిగ శ్రీను(దుబా య్ శీను) ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు ప్రకటించారు. ఐదేళ్ల పాలనలో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగనాథరాజు గ్రామా ల్లో చేసిన అభివృద్ధి శూన్యమని శెట్టిబలిజ యూత్ నాయకులు అన్నారు.

ఆకివీడు, అత్తిలి మండలాల్లో 88 శాతం ఉత్తీర్ణత

నరసాపురం.. 71.06 శాతం ఉత్తీర్ణత

నరసాపురం రూరల్, ఏప్రిల్ 22: పట్టణ మండలంలోని పదోవ తరగతి పరీక్ష ఫలితాల్లో 71.06 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. మొత్తం 1177మంది పరీక్షలు రాయగా 843 మంది పాస్ అయ్యారు. మండలం ఫస్ట్‌గా ఎల్‌బీచర్ల గురుకుల పాఠశాలలో చదువుతున్న విగ్నేష్ 583, టౌన్ ఫస్ట్‌గా చినమామిడిపల్లి స్కూల్‌కు చెందిన పావని 552 మార్కులు సాధించినట్లు చెప్పారు.

పాలకొల్లు.. 84శాతం ఉత్తీర్ణత

పాలకొల్లు అర్బన్/రూరల్: పాలకొల్లు పట్టణం, మండలంలో 10వ తరగతి పరీక్షలకు బాలురు 1007, బాలికలు 946 (1953) మంది హాజరు కాగా, బాలురు 823, బాలికలు 808 మంది 84 శాతం ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో కార్యలయం ప్రకటనలో తెలిపారు.

ఆచంట.. 75 శాతం ఉత్తీర్ణత

ఆచంట: 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలో 75 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో ఎ.ఉషారాణి, రాజేంద్రప్రసాద్ తెలిపారు. మొత్తం 449 మంది విద్యార్థులకు గాను వీరిలో 335 మంది పాస్ కాగా 114 మంది ఫెయిల్ అయ్యారు.

పాలకోడేరు.. 76 శాతం ఉతీర్ణత

పాలకోడేరు: గొరగనమూడి స్వామి జ్ఞానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా, చివరి స్థానంలో కోరుకొల్లు ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు 33 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా పాలకోడేరు మండలంలో 76 శాతం ఉతీర్ణత సాధించింది. శృంగ వృక్షం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఎం.జశ్వంత్ 579 మార్కులతో మొదటి స్థానంలో నిలిచాడు.

పెంటపాడు.. 78 శాతం ఉత్తీర్ణత

పెంటపాడు: మండలంలో 10వ తరగతి పరీక్షల్లో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో-2 టీవీ రామకృష్ణ తెలిపారు. మండలంలో 10 ప్రభుత్వ పాఠశాలలు, 5 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 649 మంది విద్యార్థులు పరీక్షలురాయగా వీరిలో 506 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.

కాళ్ళ.. 82శాతం ఉత్తీర్ణత

కాళ్ళ: కాళ్ళ మండలంలో 82శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 618 మంది పరీక్షలు రాయగా 508 మంది ఉతీర్ణులయ్యారు. కాళ్ళ హైస్కూల్లో చదివిన కాళ్ళకూరు గ్రామానికి చెందిన అవురు లిఖిత 572/600 సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించింది.

పోడూరు.. 72 శాతం ఉత్తీర్ణత

పోడూరు: పోడూరు మండలంలో 72శాతం ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని కొమ్ముచిక్కాల జడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థిని మోక్షిత 587 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. పోడూరుకు చెందిన ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు 572, 571 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు ఎంఈవో వి.సూర్యనారాయణ తెలిపారు.

పెనుమంట్ర.. 75 శాతం ఉత్తీర్ణత

పెనుమంట్ర: పదోతరగతి పరీక్షలో పెనుమంట్ర మండలంలో 75 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఇవో-2 ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు. పెనుమంట్ర హైస్కూల్‌కి చెందిన విద్యార్థి టి.ఆర్ సౌమ్యరెడ్డి 562మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు జీహెచ్ఎస్ మార్టేరు విద్యార్థిని సత్తి మాధవి లత 560 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానం బీసీ రెసిడెన్షియల్ స్కూలుకు చెందిన సాన బోయిన హర్షవర్ధన్ 560 మార్కులు సాధించారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 99శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

యలమంచిలి.. 76శాతం ఉత్తీర్ణత

యలమంచిలి: యలమంచిలి మండలంలో 76శాతం ఉత్తీర్ణత సాధించారు. మట్లపాలెం జడ్పీహైస్కూల్‌కు చెందిన గుబ్బల మీనాక్షి 588 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంఈవో కె.కృష్ణంరాజు తెలిపారు.

ఆకివీడు..88 శాతం ఉత్తీర్ణత

ఆకివీడు: ఆకివీడు మండలంలో 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో ఎ.రవీంద్ర తెలిపారు. ఆకివీడు జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల విద్యార్థినీ వైఎన్ఎస్ వైష్ణవికి 576 మార్కులతో మండల ఫస్ట్‌లో నిలిచిందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో శారద, ఆదిత్య పాఠశాలల విద్యార్థులు 586 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచారు.

మొగల్తూరులో.. 79.5 శాతం ఉత్తీర్ణత

మొగల్తూరు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 79.5 ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారి శామ్యూల్ జాన్ తెలిపారు. మండలంలో పది ప్రభుత్వ పాఠశాలల నుండి 591 మంది విద్యార్థులు పరిక్షలకు హజరు కాగా 444 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. రామన్నపాలెం పంచాయతీ పివితోట పాఠశాల విద్యార్థిని పులపల పర్తి జాహ్నవి 582 మార్కులు, జగన్నాధపురం పాఠశాల విద్యార్థిని లక్ష్మీ నాగశ్రీ 582 మార్కులు సాధించినట్టు తెలిపారు.

తాడేపల్లిగూడెం..75 శాతం ఉత్తీర్ణత

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో 75 శాతం ఉత్తీర్ణత సాధించింది. తాడేపల్లిగూడెం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు 54 ఉత్తీర్ణతా శాతంతో చివరిలో ఉండగా అత్యధికంగా మారంపల్లి జడ్పీ హైస్కూల్ 93 శాతం ఉత్తీర్ణత సాధించారు. పెదతాడేపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజారావు అభినందించారు.

అత్తిలిలో.. 88 శాతం ఉత్తీర్ణత

అత్తిలి: అత్తిలి మండలంలో 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఎం. రమేష్, ఎంపీఎల్కే ప్రసాద్ తెలిపారు. అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన సీహెచ్ రేవంత్ కుమార్‌కు 600/590 మార్కులు పొంది మండలంలో ప్రభుత్వ పాఠశాలల తరపున ప్రథముడిగా నిలిచాడు.

భీమవరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా: అంజిబాబు


భీమవరం మండలంలో ప్రచారం చేస్తున్న అంజిబాబు

భీమవరం రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భీమవరం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యత నాది. వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారు. భీమవరం రూరల్ మండల గ్రామాల్లో మంచినీటి సౌకర్యం లేదు. వాటిని నెరవేర్చే బాధ్యతను తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. భీమవరం పట్టణానికి అనుసంధానం చేసే రహదారులన్నింటినీ అభివృద్ధి చేస్తాం. నియోజకవర్గాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతామంటూ భీమవరం జనసేన కూటమి అభ్యర్థి పులపర్తి అంజిబాబు హామీ ఇచ్చారు. భీమవరం రూరల్ మండలంలో జొన్నల గరువు, తుందుర్రు, బేతపూడి, తాడేరు గ్రామాల్లో సోమవారం అంజిబాబు ప్రచారం నిర్వహించారు.

రేపు అంజిబాబు నామినేషన్

భీమవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భీమవరం నియోజకవర్గ తెలుగుదేశం-జనసేన- బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. జనసేన పార్టీ తరఫున ఉదయం 10.39 గంటలకు నామినేషన్ వేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని అంజిబాబు కోరారు.

విశ్రాంత ఉద్యోగుల చలివేంద్రం ప్రారంభం



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 22: తాడేపల్లిగూడెంలోని విశ్రాంత ఉద్యోగు ల కార్యాలయం వద్ద సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షుడు కె. సూర్రెడ్డి మజ్జిగను అందించి ప్రారంభించారు. విశ్రాంత ఉద్యోగులు పీవీ పాపారావు, ఇ. వెంకటేశ్వర్లు, ఎండీ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

టెలిఫోన్ ఎక్ఛేంజ్‌లో అగ్నిప్రమాదం



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 22: తాడేపల్లిగూడెం టెలిఫోన్ ఎక్చేంజ్ కార్యాలయంలో సోమవారం టెలిఫోన్ కాయిల్స్‌కు నిప్పంటుకుంది. అజాగ్రత్తగా నిప్పుపెట్టడం వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు. ప్రమాదంలో రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగిందని, మరో రూ.10లక్షలు ఆస్తి నష్టం కలగకుండా రక్షించామని అగ్నిమాపక అధికారి రామారావు తెలిపారు.

పురోహితుడిపైదాడి హేయమైన చర్య

కాళ్ళ, ఏప్రిల్ 22 : కాకినాడ జిల్లా పిఠాపురం వద్ద మూలపేటలో వివాహం జరిపిస్తున్న పురోహితుడు సూర్యనారాయణమూర్తిపై దాడి చేయడం హేయమైన చర్యని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు పొదిల నారాయణమూర్తి ధ్వజమెత్తారు. సోమవారం ఏలూరుపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివాహం జరిపిస్తున్న పురోహితుడిని కొంత మంది ఆకతాయిలు దాడి చేయడమే కాకుండా దానిని సామాజిక మాధ్యమాలలో ప్రసారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం స్పందించి అర్చకులపై జరుగుతున్న దాడులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమాఖ్య గౌరవాధ్యక్షులు యామిజాల నరసింహమూర్తి, సమాఖ్య తెలంగాణ విభాగం అధ్యక్షుడు విశ్వనాథశాస్త్రి పాల్గొన్నారు.

వలంటీర్లు రాజీనామా

మొగల్తూరు,ఏప్రిల్ 22: మండలంలోని పలు గ్రామ సచివాలయాలకు చెందిన 28 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో వి.బబ్బిరాజు తెలిపారు. కాళీపట్నం తూర్పు గ్రామ సచివాలయ పరిధిలో 11 మంది, మొగల్తూరు నాలుగవ సచివాలయ పరిధిలో ఏడుగురు, రామన్నపాలెం 2, పేరుపాలెం సౌత్1, కెపిపాలెం సౌత్1, ముత్యాలపల్లి 1, కొత్తోట 1, పేరుపాలెం నార్త్ 1, మోడి 1, కొత్తపాలెం 1, కెపిపాలెం నార్త్ నుంచి 1 వలంటీర్ తమ రాజీనామా పత్రాలను ఆయా గ్రామ కార్యదర్శులకు అందించినట్టు ఎంపీడీవో తెలిపారు.

ఆకివీడు: ఆకివీడు మండల పరిధిలో 31 మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో వై.రామకృష్ణ సోమవారం తెలిపారు. చినమిల్లిపాడు-5, ఆకివీడు -1లో 12, ఆకివీడు-5లో 1, కోళ్ళపర్రు-8, అయి-భీమవరం, మందపాడుకు సంబంధి ంచి-3, పెదకాపవరంలో-2 మంది వలంటీర్లు రాజీనామా చేశారన్నారు. మండలంలో ఇప్పటి వరకూ మొత్తం-245 మంది వలంటీర్లు రాజీనామా చేశారన్నారు.

తణుకు మాంటిస్సోరి ప్రభంజనం


అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు

తణుకు, ఏప్రిల్ 22: పది పరీక్షల ఫలితాల్లో తణుకు మాంటిస్సోరి స్కూలు విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు సోమవారం విలేకరులకు తెలిపారు. సి.హెచ్.జయకిరణ్ 600కు గాను 593మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. వి.గీతిక, జి.ప్రతిక్ రాజ్ 592 మార్కులతో ద్వితీయ, జి. కావ్య నాగశ్రీ 588 మార్కులతో తృతీయ స్థానం సాధించిందన్నారు. 248 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 580 మార్కులు 16 మంది, 550 పైన మార్కులు 73 మంది సాధించారన్నారు. స్కూలు టాపర్‌గా నిలిచిన జయకిరణ్‌కు రూ. 37,500 నగదు బహుమతిని స్కూలు యాజమాన్యం ఇచ్చి ప్రోత్సహించింది.

రూట్స్ విద్యార్థుల విజయకేతనం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్లు

తణుకు, ఏప్రిల్ 22: రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ప్రాక్టీస్ విద్యార్థినీ, విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఎల్.కె. త్రిపాఠి సోమవారం ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరైన 173 మంది విద్యార్థుల్లో 590 మార్కులు సాధించిన పి.సుమేధా స్కూలు టాపర్‌గా నిలిచిందన్నారు. టి.రేణుశ్రీ 584, ఎస్.లావణ్య, ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి 583, కె.మోహన్ సూర్య తేజస్విని 580 మార్కులు సాధించగా, 100 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను స్కూలు డైరెక్టర్లు బి.విద్యాకాంత్, ఎన్.సుధాకర్ వర్మ అభినందించారు.

భాష్యం విద్యార్థుల ప్రతిభ


అత్యధిక మార్కులు సాధించిన షరీనాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణ

తణుకు, ఏప్రిల్ 22: పది పరీక్షా ఫలితాల్లో తణుకు భాష్యం విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చినట్లు స్కూలు ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణ రెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు మహ్మద్ షరీనా 596 మార్కులు, గొలుగూరి దివ్య లక్ష్మీఫణి మహిమ 591, చల్లా మౌలిక నాగ వెంకట శ్రీ 589, గంటా దుర్గా నాగ వెంకట సాయి శృతి 588, టీకే జయసూర్య శివ దీపిక, కొల్లు మధుసాలిని, కొంబత్తుల వందన 587 సాధించారన్నారు. 550 మార్కులకు పైగా 58, 500 పైన 122 మంది సాధించినట్టు చెప్పారు. 214 మంది పరీక్షలకు హాజరవ్వగా 213 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జీవీ పాండురంగరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శ స్కూలు ఉత్తమ ఫలితాలు

తణుకు, ఏప్రిల్ 22: పది పరీక్షా ఫలితాల్లో ఆదర్శ స్కూలు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు స్కూలు డైరెక్టర్లు బసవా రామకృష్ణ, బాబు ఆంటోని, శ్రీనివాసులు తెలిపారు. తమ విద్యార్థి యస్. ప్రవల్లిక 581, 570కు పైగా మార్కులు 23 మంది విద్యార్థులు సాధించినట్టు తెలిపారు.

అంగన్ వాడీ కేంద్రానికి 25 కుర్చీలు అందజేత

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 22 : బ్రాడీపేట బైపాస్‌రోడ్డులోగల అంగన్‌వాడీ కేంద్రానికి ప్రముఖ వ్యాపారి గాదె వెంకన్న 25 కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో కంచర్ల రాజేష్, బాషా తదితరులు ఉన్నారు.

అన్నసమారాధన

భీమవరం టౌన్, ఏప్రిల్ 22 : పట్టణంలోని మోటుపల్లివారి వీధిలో గోగులమ్మ అమ్మవారికి సోమవారం నాడు అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం అమ్మవారికి మహాకుంభాన్ని సంఘ అధ్యక్షుడు మోటుపల్లి వీర వెంకట లక్ష్మి నరసింహచంద్రశేఖర్ దంపతులు పూజలు నిర్వహించి నివేదన అందించారు. తదుపరి భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరెళ్ళ వెంకటేశ్వరరావు, మోటుపల్లి వీరన్న అబ్బాయితాత, మోటుపల్లి వీరన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకదుర్గమ్మ తీర్థం



పెనుమంట్ర, ఏప్రిల్ 22 : పెనుమంట్ర గ్రామ దేవత శ్రీ కనకదుర్గమ్మ వార్షిక తీర్థ మహోత్సవాలు మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమనంపూడి సాయి రెడ్డి తెలిపారు. గతంలో నిత్యం అగ్ని ప్రమాదాలు సంభవించటంచేత ఈ గ్రామాన్ని పెనుమంటలుగా పిలిచేవారు. అది కాల క్రమేణ పెనుమంట్రగా రూపాంతరం చెందింది. గ్రామస్తులు చైత్రమాసం పౌర్ణమి రోజున అమ్మవారికి తీర్థ మహోత్సవాలు నిర్వహించి స్థానిక కోనేరులో సీతారామచంద్రస్వామికి తెప్పపై ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ. చెరువు చుట్టూ విద్యుత్ కాంతులు మిరుమిట్లు గొలిపే విధంగా అలంకరించారు. అమ్మవారికి మంగళవారం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించి గుడికి సాగనంపుతారు.

మాధవరంలో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 22: తాడేపల్లిగూడెం మండలం మాధవరంలో అయ్యప్పస్వామివారి యంత్ర, విగ్రహ, శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవం కన్నుల పండువగా ప్రారంభమైంది. యాగశాల ప్రవేశం, గణపతిహోమం తదితర పూజలు నిర్వహించారు.

రఘురామ నామినేషన్‌కు తరలిన శ్రేణులు

ఆకివీడు, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికలో టీడీపీ కూటమిదే విజయమని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. కూటమి అభ్యర్థి కనుమూరి రఘురామ కృష్ణరాజు నామినేషన్‌కు భారీ ఎత్తున ర్యాలీగా తరలి వెళ్లారు. జగన్ బస్‌యాత్రకు స్పందన కరువైందన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, టీడీపీ,జనసేన, బీజేపీ శ్రేణులు ఉన్నారు.

పాలకోడేరు: ఎంపీ రఘురామకృష్ణరాజుని ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించడమే తమ కర్తవ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, తెలుగుదేశం పార్టీ బీసీ నాయకుడు కామన రాంబాబు అన్నారు. మండలంలోని ఉండి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సోమవారం నామినేషన్ వేసిన ఎంపీ రఘురామకృష్ణరాజుకు మద్దతుగా పాలకోడేరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. కమ్మిలి రాంబాబు, సాలా మల్లేశ్వరరావు, దొంగ కృష్ణ, ఏసురత్నం, సంకురుదు, వనుం వెంకటేష్, అశోక్, పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కానూరికి కాంగ్రెస్ బీఫాం



నరసాపురం టౌన్, ఏప్రిల్ 22: కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కానూరి బుజ్జికి సోమవారం ఆపార్టీ రాష్ట్ర చీఫ్ షర్మిల బీఫాం అందించారు. నంద్యాల జిల్లా గాజులపల్లిలో ఉన్న షర్మిలను కలిసి బిఫాం తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పార్టీ పరిస్థితిని ఆరా తీశారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం త్వరలో జిల్లాకు షర్మిల వస్తారని కానూరి చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్ఎం దివాకర్

నరసాపురం, ఏప్రిల్ 22: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వైఎన్ కళాశాల సోమవారం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీన్నిస్టేషన్ మాస్టర్ దివాకర్ ప్రారంభించారు. వేసవి ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగిస్తామని కళాశాల అడ్వైజర్ అర్‌వీ సుబ్బారావు చెప్పారు.

సోషలిస్టు విప్లవకారుడు లెనిన్‌కి నివాళులు


లెనిన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 22 : విప్లవోద్యమం ద్వారా రష్యాలో తొలి శ్రామిక రాజ్యాన్ని స్థాపించిన సోషలిస్టు విప్లవకారుడు లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. లెనిన్ 154వ జయంతి సందర్భంగా సోమవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సీపీఐ నాయకులు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎం.సీతారాం ప్రసాదు, సికిలే పుష్పకుమారి, మల్లుల శ్రీనివాసరావు, తిరుమాని కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ కృష్ణా జిల్లా కేబినెట్ కార్యదర్శిగా రామారావు



పాలకొల్లు, ఏప్రిల్ 22 : పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ముత్యాల రామారావు లయన్స్ ఇంటర్నేషనల్ (316డి) కృష్ణా జిల్లాకు కేబినెట్ కార్యదర్శిగా నియమితులయ్యారు. 2024 - 25 సంవత్సరానికి గానూజిల్లా గవర్నర్‌గా ఎన్నికైన గద్దె శేషగిరి తన నూతన కార్యవర్గంలో అతి ముఖ్యమైన స్థానానికి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ముత్యాల రామారావును ఎంపిక చేయడం విశేషం.

ఇళ్ల వద్ద ఓటింగ్‌కు ప్రత్యేక పోలింగ్ టీమ్‌లు

ఉండి, ఏప్రిల్ 22: 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక పోలింగ్ టీంలు ఏర్పాటు చేసినట్టు ఉండి రిటర్నింగ్ అధికారి, జేసీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. అయితే వీరు సంబంధిత బిఎల్‌వోలు ద్వారా ఫారం 12డి అందజేయవలసి ఉంటుందని తెలిపారు.

పోలింగ్ ప్రక్రియకు సన్నద్ధం

ఆచంట, ఏప్రిల్ 22: ప్రస్తుతం నామినేషన్‌ల పక్రియ జరుగుతున్న దృష్ట్యా తదుపరి పోలింగ్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక అనుగుణంగా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నామని ఆచంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. స్వామి నాయుడు తెలిపారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి తక్కువ స్థాయిలో అంగీకారం తెలియజేస్తున్న దృష్ట్యా ఆ మేరకు రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.



తణుకులో ప్రచారం నిర్వహిస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణ.. హౌసింగ్ బోర్డులో పసుపు దంచుతున్న కృష్ణ తులసి

ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తాం: ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 22: చెత్త పన్నును రద్దు చేస్తాం. చెత్త ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తామని తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని ఐదో వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని పలువురు ఆరిమిల్లి దృష్టికి తీసుకు వచ్చారు. మున్సిపాల్టీకి పాలక మండలి లేకుండా చేసి, అధికారులను గుప్పిట్లో పెట్టుకుని కారుమూరి దందా నడిపించారని వివరించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

తణుకు పట్టణం, అత్తిలి మండలాల నుంచి పెద్ద ఎత్తున వైసీపీ నుంచి పలువురు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పట్టణ కాపు సంఘం ఉపాధ్యక్షుడు గాజుల కాశీ విశ్వనాథం, పోలేపల్లి ప్రసాద్, కానూరి రాంబాబు, కామన శ్రీనివాసు, బొమ్మల హనుమంతరావుకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గారపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వందల సంఖ్యలో చేరారు.


స్వేచ్ఛ కావాలంటే కూటమి రావాల్సిందే

తణుకు, ఏప్రిల్ 22: స్వేచ్ఛ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించుకుం దామని నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు భయభ్రాంతులతో బతుకుతున్నారని, ఆ పరిస్థితులు పోవాలంటే రాధాకృష్ణను గెలిపించుకోవాలని కోరారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బొలిశెట్టి శ్రీనివాస్.. చిత్రంలో వలవల బాబ్జి తదితరులు

వ్యాపారుల అభివృద్ధికి కృషి : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 22: వర్తక సంఘాలకు అందుబాటులో ఉండి వారి అభివృద్ధికి కృషి చేస్తానని తాడేపల్లిగూడెం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలో చిల్లర వర్తక సంఘం సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అద్దె చెల్లించలేక రోడ్లపై వ్యాపారం చేసుకుంటున్న వారిని పన్నుల పేరుతో వేధిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ నియోజవర్గ అభివృద్ధి కోసం బొలిశెట్టి శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు


పార్టీలో చేరిన వారితో బొలిశెట్టి శ్రీనివాస్

జనసేనలో చేరికలు

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 22: రానున్న రోజుల్లో వైసీపీ మొత్తం ఖాళీ అవడం ఖాయమని తాడేపల్లిగూడెం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మేడపాటి చెల్లారెడ్డి ఆధ్వర్యంలో వీకర్స్ కాలనీకి చెందిన గంధం సత్తిబాబు, కాసిన శ్రీనివాస్, సోపేటి జాని తదితరులు బొలిశెట్టి సమక్షంలో సోమవారం జనసేనలో చేరగా వారికి కండువా కప్పి బొలిశెట్టి వారిని పార్టీ లోకి ఆహ్వానించారు.

బుల్లిరాణికి గోల్డెన్ నంది అవార్డు



తణుకు, ఏప్రిల్ 22: తణుకు పట్టణానికి చెందిన సంకురాత్రి బుల్లిరాణికి ఓల్డేజి హోమ్స్, అనాథ సేవలకు గాను గోల్డెన్ నంది అవార్డు అందుకున్నారు. ఉగాది సందర్భంగా హైదరాబాదులో ఆదర్శ కళా నిలయం ఆధ్వర్యంలో ఈ పురస్కారం అందుకున్నారు. గత 18 ఏళ్లుగా వృద్ధులు, అనాథలు, ఓల్డేజ్ హోమ్స్‌లో ఎన్నో సేవలు చేస్తూ, సామాజిక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నందున లైఫ్ టైం అచీవ్‌మెంటు అవార్డు అందించినట్లు తెలిపారు. ఈమె తణుకుకు చెందిన స్వాతంత్ర్య సమరయోదుడు సంకురాత్రి వెంకట సుబ్బారావు మనుమరాలు. బుల్లిరాణి తణుకు మున్సిపాల్టీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన సత్యనారాయణమూర్తి కుమార్తెగా అందరికి సుపరిచితులే.

కోర్టు ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు

తణుకు, ఏప్రిల్ 22: వేసవిలో దాహం తీర్చడం మానవ సేవ అని తణుకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.హనుమంతరావు అన్నారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో చలివేంద్రంను ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, కౌరు వెంకటేశ్వర్లు, అంబేద్కర్, నాగేశ్వరరావు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు


భీమవరం అర్బన్, ఏప్రిల్ 22 : వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి మే 3వ తేదీ వరకు ఉదయం 8.30 గంటల నుంచి 10.30 వరకు డీఎన్ఆర్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వసుధ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు.

విస్సాకోడేరులో ఫ్యామిలీ ఫిజిషియన్



పాలకోడేరు, ఏప్రిల్ 22 : విస్సాకోడేరు సచివాలయం1లో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ హషిత ఆధ్వర్యంలో బీపీ, షుగర్, గర్భిణులు, సాధారణ రోగులు 154 మందికి వైద్య సేవలందించారు. ఈ క్యాంప్‌లో హెచ్‌వీపీ నాగమణిమ్మ, ఎమ్ఎల్‌హెచ్‌పీ లలిత, హెల్త్ అసిస్టెంట్ వైఎస్ఆర్ గోపాలకృష్ణ, ఏఎన్ఎం హేమ, భవాని, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట కాంగ్రెస్ అభ్యర్థిగా నెక్కంటి సతీశ్



ఆచంట, ఏప్రిల్ 22: ఎట్టకేలకు ఆచంట కాంగ్రెస్ అభ్యర్థిని పార్టీ అధిష్టానం సోమవారం ప్రకటించింది. ఆచంటకు చెందిన నెక్కంటి సత్యనారాయణ (సతీశ్) పేరును ఖరారు చేసినట్లు సతీశ్ తెలిపారు. 2019లో జరిగిన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా సతీశ్ ఆచంట నుంచి పోటీ చేశారు. రెండుమూడు రోజుల్లోనే నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు.